క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో సూర్యా విద్యార్థుల ప్రతిభ


పులపర్తి మౌనిక


అధికారి చరిష్మా

నరసాపురం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని శ్రీసూర్యా కళాశాల విద్యార్థులు ఈ ఏడాది కూడా టౌన్‌ఫస్ట్ సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో పులపర్తి మౌనిక 470 మార్కులకు గానూ, 465 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించినట్టు అలాగే స్టేట్ 2వ ర్యాంకు సాధించినట్టు చెప్పారు. సీఈసీ విభాగంలో అధికారి ప్రణీత 500 మార్కులకు గాను 479 మార్కులతో టౌన్‌ఫస్ట్ సాధించినట్టు చెప్పారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో అధికారి చరిష్మా 976 మార్కులు సాధించినట్టు చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 75 మంది విద్యార్థులు 400పైగా మార్కులు, సీనియర్ ఇంటర్‌లో 60 మంది 950కి పైగా మార్కులు సాధించినట్టు చెప్పారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినంధించారు.

ఇంటర్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


ఆదిత్య విద్యార్థులతో డైరెక్టర్ రాఘవరెడ్డి

పాలకొల్లు సెంట్రల్: ఇంటర్మీడియట్ పరీక్షా పలితాల్లో ఆదిత్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.వి రాఘవరెడ్డి తెలిపారు. గురువారం వివరాలు వెల్లడిస్తూ జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో పి.గోవర్ధన్, ఎన్.జయశ్రీ, కె భవ్యశ్రీ లక్ష్మి 464 మార్కులు, ఎం.లోకేష్ రామ్, ఎం.అశ్మిత, పీఎస్ఎస్ సాయిగణేష్, ఎస్ఈవీ రామచరణ్, పి.వినీలు 463 మార్కులు, బైపీసీ విభాగంలో కె. హారిక 427 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ పలితాల్లో ఎంపీసీ విభాగంలో పి.రుతుకుమారి 989, కె. లక్ష్మిదుర్గ 987, డీఎస్ఎస్ సత్యసింధుష 986, వి.సిరి చందన, చందు సిరిశ్రీ 983 మార్కులు, బైపీసీ విభాగంలో వై.హేమదుర్గ శ్రీజ 987 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. ఏఓ జి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


మునమర్రులో పేదలకు దుప్పట్లు పంచుతున్న మానవత సభ్యులు

పెనుగొండ: ఆపదలోఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా మానవత సంస్థ పనిచేస్తుందని మానవత ప్రెసిడెంట్ డాక్టర్ బాలచందర్ సాదే అన్నారు. గురువారం మునమర్రులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. తమవారిని కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబాలకు ఆసరాగా ఫ్రీజర్ బాక్సు, శాంతిరథం, అంబులెన్స్ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ చైర్మన్ కర్రి నరేంద్రరెడ్డి, మండల చైర్మన్ తేతల వెంకటకుమార్ రంగారెడ్డి(దొరబాబు), కార్యదర్శి తానేటి భాస్కర్‌కుమార్, కొప్పిశెట్టి సూర్యనారాయణ, శివరామరెడ్డిలు పాల్గొన్నారు.

వాసవిమాతకు ప్రత్యేక పూజలు


పెనుగొండలో వాసవీ మాతకు కుంకుమార్చనలు చేస్తున్న అర్చకులు

పెనుగొండ: శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజు గురువారం అమ్మవార్లకు కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండుతులు రామడుగుల నరసింహమూర్తి,ఆలయ ప్రధాన అర్చకులు కోట సుబ్రహ్మణ్యంలు పర్యవేక్షణలో నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, వాసవీ కన్యకపరమేశ్వరి, మహిషాసురమర్దనీ అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవీ మాతకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వాసవీ గీతా మహిళా సమాజం ఆధ్వర్యంలో వాసవీ పురాణం పారాయణ చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కోట్ల మోహనరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులకు రుణాలు అందిస్తాం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


తూర్పుపాలెంలో అగ్నికుల క్షత్రియులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


తూర్పుపాలెంలో సచివాలయ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దొంగరావిపాలెం, సిద్ధాంతంల్లో అగ్నికుల క్షత్రియులకు రుణాలుపై బోట్లు అందించనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం తూర్పుపాలెంలో అగ్ని కుల క్షత్రియుల సంఘ నాయకులతో మాట్లాడారు. దొంగరావిపాలెం, సిద్ధాంతంల్లో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఆచంట వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి, పార్టీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, గుబ్బల వీర బ్రహ్మం, మేడిచర్ల పండు, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణాలు పూర్తి చేయాలి

నియోజకవర్గంలో సచివాలయాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం తూర్పుపాలెంలోని సచివాలయ భవన నిర్మాణాలను పరిశీలించారు. గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ నిర్మాణాలు పూర్తి చేసి సేవలను మరింతగా అందించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కోళ్ల గోవిందరావు, పార్టీ నాయకులు గుబ్బల వీర బ్రహ్మం, మేడిచర్ల పండు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

పెనుగొండ: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు పెనుగొండ ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి సొంత ఖర్చులతో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం పెనుగొండ కెనాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌లు కోట్ల మోహనరావు, మేడపాటి చిరంజీవి రెడ్డి, సచివాలయ కన్వీనరు వేంద్ర లీలా వెంకటరమణ, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, గాజుల బులి పుల్లారావు, చెవ్వేటి రాజు, పలివెల శ్రీను, పట్టణ పార్టీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్ కుమార్, బళ్ల చిన్న, మెరిపే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి సేవలో కవురు


శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి హారతి ఇస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 4వ వార్డులో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతరలో భాగంగా గురువారం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి పూలమాలలు అలంకరించి హారతి ఇచ్చారు. ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని శ్రీనివాస్ అన్నారు అనంతరం నిర్వాహకులు అమ్మవారి శేషవస్త్రాలతో శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ తలుపూరి భుజంగరావు, వైసీపీ నాయకులు కేశవరపు సత్యనారాయణ, వెలివెల సర్పంచ్ కెల్లా సింహాచలం, బీసీ సంఘ నాయకుడు కర్నేన గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ సైట్లపై మున్సిపాలిటీ కొరడా

సాక్షి స్పందన


ఖాళీస్థలంలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్ళ మధ్య ఉన్న ఖాళీ స్థలాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు. ఈ నెల 24న 'అమ్మో ఓపెన్ సైట్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఖాళీస్థ లాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్థలాలను శుభ్రం చేసుకోకపోతే ఐపీసీ సెక్షన్ 269 ప్రకారం టౌన్ న్యూసెన్స్ యాక్ట్ ప్రకారం సదరు స్థలాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకు పోయి, దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. దీనిపై మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖాళీస్థలాల యజమానులకు మొదటి అవకాశంగా రెండు, మూడు రోజులు సమయం ఇస్తామన్నారు. పట్టణంలో దాదాపు 500 వరకూ ఓపెన్ సైట్లు గుర్తించామని చెప్పారు. సదరు స్థలాల యజమానులు వెంటనే తప్పు సరిదిద్దుకోపోతే పోలీసు కేసులు పెడతామని హెచ్చరించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన


పెనుమదంలో బీసీ కమ్యూనిటీహాలును ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పోడూరు: వైఎస్సార్‌సీ పీ ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో మౌళిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తామని జెడ్పీ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. పెనుమదం శివారు అనసూరివారి వీధిలో ప్రభుత్వ నిధులు రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాలును, తెలుగుపాలెంలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన స్నానఘట్టాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం సీఎం వైఎస్.జగన్‌మోహన్ పరిపాలనతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు విస్తృతంగా నిధులు ఇచ్చామనీ, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, ఉప సర్పంచ్ పితాని చిన్న, సొసైటీ చైర్మన్ కొప్రపాటి వీరాస్వామి, వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు, పార్టీ నాయకులు అల్లు మురళి, పాటంశెట్టి నాగరాజు, బొడ్డు బాబి, ఎం.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం


పాలకొల్లు శంభునిపేటలో అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని శంభునిపేటలో బుధవారం రాత్రి ప్రదర్శించిన సంఘం శరణం గచ్చామి (అంబేడ్కర్ జీవిత చరిత్ర) నాటకం యువతరాన్ని ఆకట్టుకుంది. సమాజంలో విద్య ప్రధానమని ఈ నాటకం తెలియజేసింది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్‌కి చెందిన 40 మంది కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. ది పాలకొల్లు నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, భీమవరం ఆర్డీవో దాసి రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఉన్నమట్ల కబర్ధి, దళిత కవులు కోలాటి చిన పెద్దిరాజు, ఉన్నమట్ల మూరిబాబు, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ స్వయంగా వీక్షించి నాటకంలో పలు పాత్రలు పోషించిన కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓదాసి రాజు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, విగ్రహదాత వడూరి రత్నకుమార్‌లను నవచైతన్య యూత్ అధ్యక్షుడు కోట రత్నరాజు, మద్దా చంద్రకళ, నక్కా ప్రభాకరరావు, విల్లూరి రాజ్‌కుమార్, మెడవల రాజా తదితరులు శాలువాతో సత్కరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, ఆచంట, పెనుగొండ పరిసర ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు ఉదయం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పూడిక పనులు త్వరగా పూర్తి చేయాలి

మొగల్తూరు: జగనన్న కాలనీల్లో పూడిక పనులు త్వరతగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ సిద్ధాంతి ఆదేశించారు. పూడిక తీత పనులకు ప్రభుత్వం రూ.7.50 లక్షలు మంజూరు చేయడంతో శుక్రవారం మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్పలోని జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. సుమారు 60 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించామని, లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలకు సిద్ధంగా ఉన్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ ఫణీంద్ర, పడవల సత్యనారాయణ తదితరులున్నారు.

అనారోగ్య బాధితురాలికి సాయం

పోడూరు: కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శాంతికుమారి కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యఖర్చులు భారంగా మారాయి. శాంతికుమారి పరిస్థితి తెలుసుకుని వసుధ ఫౌండేషన్ ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు గురువారం శాంతికుమారి భర్త వెంకట రామకృష్ణంరాజుకు ఆ సొమ్ము అందజేశారు. ఆర్థికసాయం అందించడంపట్ల శాంతికుమారి కుటుంబసభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని అడవిపాలెం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ కొప్పర్రు ఫీడర్, 11కేవీ విజయలక్ష్మి ఇండస్ట్రియల్ ఫీడర్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బళ్ల సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మండలంలోని పెదగరువు, లయన్స్‌నగర్, వరిధనం, పెదమామిడిపల్లి, దిగమర్రు, కొత్తపేట, గుబాలగుంట, పెంకుళ్లపాడులో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈబీసీ నేస్తం అగ్రవర్ణ పేదలకు వరం


కొడమంచిలిలో ఈబీసీ నేస్తం లబ్ధిదారుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఈబీసీ నేస్తం పథకం అగ్రవర్ణ పేదలకు వరం లాంటిదని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. గురువారం కొడమంచిలి రైతు కమ్యూనిటీ భవనంలో ఈబీసీ నేస్తం లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అగ్రవర్ణ పేదలకు అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కొడమంచిలిలో పార్టీలకతీతంగా 67 మంది లబ్ధిదారులకు రూ.9,45,000 జమ చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల సంక్షేమానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషి చేస్తున్నార న్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హీనా భాను, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు దానియేలు, రాజకమల్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలుకూరి నరేంద్ర, పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలను అందించాలి


ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు

నరసాపురం రూరల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అవసరమైన పుంత రోడ్ల నిర్మాణాలు తదితర పనులను చేపట్టి పూర్తి చేస్తామని మర్కెట్ కమిటీ అధ్యక్షుడు గుబ్బల రాధాకృష్ణ అన్నారు. గరువారం నరసాపురం మండలంలోని సరిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మార్కెట్ కమిటీలో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా చురుగ్గా ధాన్యం సేకరణ జరగాలని సభ్యులు ప్రస్తావించారు. కార్యక్రమంలో తొలుత మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ నిర్మాణ పనులను సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, మార్కెట్‌యార్డు సిబ్బంది ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: పాదచారులు, వాహనదారులకు వేసవికాలంలో ఈ చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పట్టణ సీఐ డి.రాంబాబు అన్నారు. గురువారం స్థానిక న్యూ క్లాత్ మార్కెట్‌లో ది పాలకొల్లు క్లాత్ అండ్ యారన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ డి రాంబాబు మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ తీవ్రతకు ప్రజలు అలసటకు గురవకుండా ఉండడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి పాదచారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ వట్టం గణేశ్వరరావు, సెక్రటరీ సలాది జానీ, బొండాడ చినబాబు, కానూరి రాము తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు

పాలకోడేరు: మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ ప్రకారం ధాన్యం సేకరణ కొనుగోలు ప్రారంభమైంది. ఇందుకోసం 14 రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలుకు ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే 407 మంది రైతులు నుంచి 5,378 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణ రావు తెలిపారు. ఈ సీజన్లో మండలంలో 11,950 ఎకరాల లో రైతులు వరి 1121, 1156,1153 రకాలను పండించారన్నారు. 1121 రకం మాత్రమే ప్రస్తుతానికి సేకరించి కొనుగోలు చేశామన్నారు. 1156, 1153 రకాల విషయంలో ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు.

తీరనున్న తీరప్రాంత ప్రజల నీటి కష్టాలు

- వియర్ చానల్‌కు రూ.24 కోట్ల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


నిరుపయోగంగా పడి ఉన్న పంటబోదె

మొగల్తూరు: వియర్ చానల్ పనులు చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ప్రభుత్వం ఈ పనులకు రూ.24 కోట్లు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఇటీవల విలేకరుల సమావేశంలో తెలపడంతో తీర ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం-మొగల్తూరు ప్రధాన కాలువ నీరు స్థానిక లాకు వరుకు వచ్చి ఆగిపోతుంది. ఇలా నిలిచి పోయిన నీరు వృథాగా దర్బరేవు డ్రెయిన్‌లోకి కలిసిపోతుంది. ఇదే కాలువ ఎగువ భాగంలో జంగిల్ కాలువ ద్వారా రామన్నపాలెం, కేపీ పాలెం గ్రామాలకు సాగు, తాగునీరు అందుతుంది. ఈ విధంగానే లాకుల వద్ద వృథాగా పోతున్న నీటిని తీర ప్రాంత గ్రామాలైన కొత్తకాయలతిప్ప, మోడి, ముత్యాలపల్లి, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల పరిధిలోని 3 వేల ఎకరాలకు సాగు నీరు,ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు వియ్యర్ చానల్ నిర్మాణానికి రూపకల్పన చేశారు. వియర్ చానల్ పనులును ఆరు రీచ్‌లుగా విభజించి 1983లో అప్పటి మంత్రి జానారెడ్డితో శంకుస్థాపన చేయించారు. ఆరు రీచ్‌ల్లోను రెండు రీచ్‌ల్లో 80 శాతం పనులు పూర్తి కాగా, మిగిలిన రీచ్‌ల్లో పనులు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి.

రూ.2.80 కోట్లు మంజూరు చేసిన దివంగత నేత

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో రాజీవ్ పల్లె బాటలో భాగంగా మండలంలో పర్యటించిన సందర్భంఅప్పటి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముదునూరి ప్రసాదరాజు వియర్ చానల్ ఆవశ్యకతను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే రూ.2.80 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేసినా పనులు మొదలుకాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని టీడీపీ నాయకులు అప్పటి రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో అట్టహాసంగా మరోసారి శంకుస్థాపన చేయించారు. అయినా ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పనులు ప్రారంభం కాలేదు.

మరోసారి ప్రతిపాదనలు

వియర్ చానల్‌ను పూర్తిగా పరిశీలించి మరోసారి నివేదికను అందించాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు రూ.24 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వియ్యర్ చానల్ ఆవశ్యకతను చీఫ్‌విప్ ప్రసాదరాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. గతేడాది నవంబర్‌లో నరసాపురం నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వియ్యర్ చానల్ పనులకు శంకుస్థాపన చేశారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



వియ్యర్ చానల్ పనులకు రూ.24 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. అవసరమైతే భూములు కొని చానల్ పనులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. తీర ప్రాంత గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగు, తాగు నీరందిస్తాం.

– చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజల కల సాకారం



వియర్ చానల్ పనులకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నిదుల మంజూరు చేయడంతో తమ కాల సాకారం కాబోతుంది. గతంలోను ప్రసాదరాజు హయాంలోనే నిధుల మంజూరుయ్యాయి. వియ్యర్ చానల్ పనులు పూర్తిస్థాయిలో తాగు, సాగు నీరందడంతో మాకు ఇబ్బందులు తప్పుతాయి.

– కర్రి ఏసుబాబు, పేరుపాలెం

మే 5న జాబ్ మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం భీమవరం రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో వచ్చే నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు గురువారం విలేకరులకు తెలిపారు. చెన్నైకు చెందిన డీస్టీల్ గ్రూఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులతో పాటు పదో తరగతి, ఇంటర్, డిప్లమో, బీఈ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్సులతో హాజరుకావాలని కోరారు.